కాఫీ స్టీలీ..!



- దీపావళి తర్వాత
- కాఫీ ప్రియులకు షాక్
- భారీగా పెరగనున్న ధరలు
- కొండెక్కిన గింజల ధర
- రాష్ట్రంలో తగ్గిన దిగుబడి
- విదేశాల్లో పెరిగిన ధరలు
- దేశీయ కాఫీకి డిమాండ్
- పశ్చిమ కనుమల్లో
- వర్షాలతో తగ్గిన దిగుబడి



బెంగళూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కాఫీ ప్రియులకు షాక్ తగలనుంది. గింజల ధరలు పెరగడంతో కాఫీ ధరల పెంపునుకు బోర్డు సిద్ధమయ్యింది. దేశీయ కాఫీకి విశ్వవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అరేబికా కాఫీకంటే రొబస్టా రకం ఈ ఏడాది 50 కేజీలు రూ.20వేలకు చేరడం దేశీయ కాఫీ పరిశ్రమలో సంచలనం రేపింది. కాఫీ గింజల ధరలు ఇటీవల ఊహించనంతగా పెరుగుతుండడంతో కొన్ని నెలలక్రితం నిల్వ ఉండే కాఫీ ధర కూడా అమాంతం పెంచేశారు. దేశంలో అత్యధికంగా కాఫీ కర్ణాటకలో సాగు అవుతోంది. పశ్చిమ కనుమలకు అనుబంధమైన కొడగు, దక్షిణకన్నడ, ఉడుపి, చిక్కమగళూరు, శివమొగ్గ, ఉత్తరకన్నడ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కాఫీ సాగు దశాబ్దాల కాలంగా సాగుతోంది. కాఫీలో ప్రధానంగా రొబస్టా, అరేబికా రకాలు విస్తారంగా సాగులో ఉన్నాయి. ఇటీవల కొన్నేళ్లుగా కావేరి రకం కాఫీ వంగడం కూడా అందుబాటులో ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో అరకు ప్రాంతంలోనూ కాఫీ సాగు చేస్తారు. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా కాఫీ సాగు చేసే బ్రెజిల్, వియత్నాంలలో వాతావరణ వైపరీత్యాల కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గింది. దేశీయ మార్కెట్‌లోనూ దిగుబడి పడిపోవడం ఓ కారణం అయితే నాలుగు నెలలుగా జోరువర్షాలు మరో కారణంగా చెప్పవచ్చు. ఇలా కాఫీ ధరలు పెరగడానికి పలు కారణాలు చెప్పవచ్చు.


పశ్చిమ కనుమల్లోని కాఫీ తోటలు

అమాంతం పెరిగిన గింజల ధరలు

రెండు రోజుల క్రితం అరేబికా రకం కాఫీ గింజలు 50కేజీల బస్తా రూ.18వేలు పలకగా, రొబస్టా రకం రూ.20వేలకు చేరింది. కాఫీ సాగు చేసే రైతుల వద్ద పాత నిల్వలు లేకపోవడంతో ఒక్కసారిగా ధరలు పెరిగినా రైతులకు వచ్చే లాభం అంతంత మాత్రంగా ఉంది. కేవలం కొందరు మాత్రమే కాఫీ గింజలను నిల్వ ఉంచుకున్నారు. వారికి మాత్రం ఆదాయం వచ్చే అవకాశం ఉంది. హోల్‌సేల్ వ్యాపారులకు ధరలు కలసి వచ్చినట్లయ్యింది. సాధారణంగా డిసెంబరులో కాఫీ గింజల కోతలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ లేదా మే నెలలో కొత్త కాఫీ గింజలు మార్కెట్‌లోకి వస్తాయి. అప్పటి దాకా ఇదే ధరలు పలుకుతాయా... అనేది వేచి చూడాలని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది వర్షాలతో కాఫీ సాగులో 40 శాతం దిగుబడి తగ్గింది. ఆగస్టు నుంచి నిరంతరంగా వర్షాలు కురుస్తుండడంతో కాఫీ గింజలు చెట్లనుంచి రాలిపోయాయి. దీంతో కూడా దిగుబడి పడిపోయింది. బ్రెజిల్, వియత్నాంలలో పంట ఆశాజనకంగా ఉంటే దేశీయకాఫీకి అంత డిమాండ్ ఉండేది కాదు. అక్కడా వాతావరణంలో మార్పుల కారణంగా దిగుబడి తగ్గడంతో మనదేశంలో పండే కాఫీ గింజలకు డిమాండ్ తారస్థాయికి చేరింది.



అంతర్జాతీయ మార్కెట్‌లోనూ అదే జోరు..

కాఫీ పొడి తయారీ కేంద్రాలు కొందరు మాత్రమే సొంతతోటలలోని కాఫీ గింజలను నిల్వ ఉంచుకుంటారు. అయితే ఎక్కువశాతం కాఫీపొడి తయారు చేసే కంపెనీల గింజలను కొనుగోలు చేసి వాటిని పొడిగా మారుస్తారు. 50కేజీల బస్తా రూ.20వేలు ధర పలకడంతో బెంగళూరులో కేజీ కాఫీ పొడిపై ఒక్కసారిగా కేజీకి వంద రూపాయలు పెంచారు. చిక్క మగళూరులో సాధారణంగా రూ.400-450 ధర ఉంటుంది. ఇటీవల అది రూ.500కు చేరింది. అయితే కాఫీ పొడి తయారీ పరిశ్రమలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు గింజలను గోడౌన్‌లలోనే నిల్వ ఉంచుకుని కొంతమేర మాత్రమే పొడి చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అను గుణంగా కాఫీ గింజల ధరల్లో వ్యత్యాసం ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించే అవకాశం ఉండదు.



దీపావళి తర్వాతే ముహూర్తం..

మార్కెట్‌లో కాఫీ పొడికి డిమాండ్ పెరగడంతో టీ పొడి ధరలు కూడా పెంచారు. మరోవైపు పాలధరలు పెరిగే అవకాశం ఉందని నందిని పాల ఉత్పత్తి సంస్థ ఇదివరకే ప్రకటించింది. దీంతో దీపావళి తర్వాత కాఫీ ప్రియులకు షాక్ తప్పదనిపిస్తోంది. ఈ ఏడాది మార్చి నుంచి సెప్టెంబరు దాకా కాఫీ పొడి ధరలు రెండుసార్లు పెరిగాయి. తొలిసారి రూ.80, రెండోసారి రూ.70 కేజీకి పెరిగింది. ప్రస్తుతం నాణ్యమైన కాఫీ పొడి రూ.750దాకా ధర పలుకుతోంది. త్వరలోనే కేజీకి రూ.100-120 దాకా పెంచదలిచినట్లు కాఫీ బోర్డు సూత్రప్రాయంగా ప్రకటించింది. జనవరిలో చికోరి మిశ్రితమైన కాఫీ రూ.200-250దాకా ఉండేది. ఆ తర్వాత రూ.420కు పెరిగింది. మరో వంద పెరిగే అవకాశం ఉంది. చికోరి లేని స్వచ్ఛమైన కాఫీ పొడి రూ.750 ధర పలుకుతోంది. కాగా టీ పొడి ధర కూడా రూ.40-50 దాకా పెరగనుంది.

కాఫీ, టీ ధరల పెంపు అనివార్యం

- హోటళ్ల సంఘం అధ్యక్షుడు పీసీ రావ్

కాఫీ పొడి ధర ఈ ఏడాదిలో రెండుసార్లు పెరిగిందని దీంతో కాఫీ, టీ ధరల పెంపు అనివార్యమైందని బెంగళూరు హోటళ్ల సంఘం అధ్యక్షుడు పీసీ రావ్ అభిప్రాయపడ్డారు. కాఫీ, టీ, పాలధరలు పెరిగితే హోటళ్లు కూడా పెంచడం తప్ప మరో మార్గం ఉండదన్నారు. సాధారణంగా కాఫీ రూ.10 నుంచి 30 దాకా బెంగళూరులో ధర పలుకుతోంది. కాఫీ పొడి రేటు పెరిగితే మరోమార్గం లేకుండా వినియోగదారులకు అందించే స్వచ్ఛమైన కాఫీపై ధర పెంచాల్సి ఉంటుందన్నారు. అయితే విదేశాలనుంచి కాఫీ దిగుమతి చేసుకునేలా కాఫీబోర్డు ప్రయత్నించాలని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

మరోసారి నేనే సీఎం

- సిద్ధూ ప్రభుత్వం పూర్తికాలం కొనసాగదు
- జేడీఎస్ మనుగడ ఎవరి భిక్ష కాదు
- కేంద్రమంత్రి కుమారస్వామి



బెంగళూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'మరోసారి నేను ముఖ్యమంత్రి' అవుతా..జేడీఎస్ మనుగడకు ఎవ్వరి మద్దతు అవసరం లేదు.. అని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి ధీమా వ్యక్తం చేశారు. మండ్యలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2028 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగడం కల్లేనన్నారు. ప్రజలు మళ్లీ తనకే ఒక అవకాశం ఇస్తారన్న విశ్వాసం ఉందన్నారు. 2028లోగానే అటువంటి చాన్స్ రానుందన్నారు. తాను జ్యోతిష్యుడు కాదని అయితే విశ్వాసంతో చెబుతున్నానన్నారు. ఐదేళ్ల పాలన సాగించేందుకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నానన్నారు. గతంలో 14 నెలల పాలనలో మరొకరి చేతిలో కీలుబొమ్మలాగా మారానన్నారు. ఐదేళ్లపాటు అవకాశం ఇస్తే తన అనుభవంతో మరిన్ని మంచి పనులు చేస్తానన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కొరత లేదని, సమృద్ధిగా నిధులున్నా లూటీ సాగుతోందన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఛీ కొట్టేరోజులు వచ్చాయన్నారు. ఈ విధంగా మరోసారి ముఖ్యమంత్రి కావాలన్న కోరికను కుమారస్వామి బయటపెట్టారు. కాగా బీజేపీతో పొత్తు కారణంగానే జేడీఎస్‌కు మనుగడ సాధ్యమైందని చన్నపట్టణ టిక్కెట్‌ను వదులుకోవాలని బీజేపీ నేత బసనగౌడ పాటిల్ యత్నాళ్ వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. జేడీఎస్‌కు ఎవ్వరూ పునర్జన్మ ఇవ్వాల్సిన పనిలేదని, దశాబ్దాల కాలంగా ఒక లక్ష్యంతో కొనసాగుతోందన్నారు. దానిని ఆపడం ఎవ్వరి తరం కాదన్నారు.

కొంత కొన్నారు.. మరింత కొట్టేశారు..!

- సీఎం భార్యపై మరో భూ ఆక్రమణ ఆరోపణ

బెంగళూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల వివాదంలో ఉక్కిరి బిక్కిరవుతున్న సీఎం సిద్దరామయ్యపై మరో ఆరోపణలు రావడం సంచలనం రేపుతోంది. కోట్లాది రూపాయల ముడా భూమిని తక్కువ ధరకే కాజేశారన్న విమర్శలతో సిద్ధూకు మరో దెబ్బ తగిలినట్లయ్యింది. సీఎం సిద్దరామయ్య భార్య పార్వతిపై సామాజిక కార్యకర్త గంగరాజు మరో భూ ఆక్రమణ ఆరోపణలు చేశారు. మైసూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గణేశ్ దీక్షిత్ అనే వ్యక్తికి సంబంధించిన 21వేల చదరపు అడుగుల స్థలాన్ని 2023 సెప్టెంబరులో సిద్ద రామయ్య భార్య కొనుగోలు చేశారన్నారు. వివాదంలో ఉన్నప్పటికీ దానిని ముడా అధికారులు అప్పజెప్పారన్నారు. మైసూరులో హెబ్బాళ పారిశ్రామికవాడలో 20 కుంటల స్థలాన్ని 2023 సెప్టెంబరు 29న సీఎం భార్య పార్వతి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. కేఆర్ రోడ్డులోని సర్వే 454లో గణేశ్ దీక్షిత్‌కు చెందిన 4.11 ఎకరాల స్థలంలో భాగం కాగా, అందులో 20 సెంట్లకుగాను 1.85 కోట్ల రూపాయలు చెల్లించారన్నారు. అందులో 8,998 చదరపు అడుగులు ముడాకు సంబంధించినదేనన్నారు. రోడ్డు, పైప్‌లైన్ ఉండే స్థలాన్ని కూడా తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. 2024 ఆగస్టు 31న సవరణలు చేయించుకున్నారని, ముడా స్థలాన్ని వీడి మిగిలిన 12,782 చదరపు అడుగులు మాత్రమే రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపించారు.

ఉపపోరుపై..ఉత్కంఠ..!

- చన్నపట్టణ వదలాలని బీజేపీ డిమాండ్
- పట్టు వదలని కుమార
- కాంగ్రెస్ నుంచి బరిలోకి డీకే సురేష్..!


డీకే సురేష్

బెంగళూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల్లో నో అన్నవారే అభ్యర్థులు కానున్నారా..?బరిలో దిగేది పాత అభ్యర్థులేనా అనేది చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల దాఖలు ప్రారంభమైన రెండోరోజూ శిగ్గావిలో రెండు, చన్నపట్టణలో ఓ నామినేషన్ దాఖలైంది. మూడు శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో అందరి దృష్టి చన్నపట్టణపైనే ఉంది. ఈ స్థానంపై కేంద్రమంత్రి కుమారస్వామి పట్టుదలతో ఉన్నారు. మరోవైపు మిత్రపక్షమైన బీజేపీ కూడా వదులుకునేందుకు సిద్ధంగా లేదు. చన్నపట్టణ నుంచి మాజీ ఎంపీ డీకే సురేశ్ అభ్యర్థి అవుతారని ప్రారంభంలో ప్రచారం సాగింది. దీనిపై డీకే సురేష్ తీవ్రంగా స్పందించారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారని ఆ వెంటనే ఎన్నికలకు వెళ్లేందుకు మాకూ సిగ్గుండాలని వ్యాఖ్యానించారు. పోటీ చేసేది లేదని స్పష్టం చేశారు. అయితే నెలలు గడిచేకొద్దీ ఈ స్థానంపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ నుంచి డీకే సురేశ్ ఒక్కడే సమర్థవంతుడైన అభ్యర్థి అనే చర్చ జోరందుకుంటోంది. మరోవైపు బీజేపీ-జేడీఎస్‌లలో అభ్యర్థి ఎవరనేది గంటగంటకు మలుపులు తిరిగేలా మారుతోంది. కుమారస్వామి ప్రాతినిథ్యం వహించిన స్థానాన్ని వదులు కోకుండా భార్య అనితా కుమారస్వామి లేదా కుమారుడు నిఖిల్‌ను బరిలో దించాలని భావిస్తున్నారు. దీనిని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇప్పటివరకు సాధారణంగా ఉన్న పార్టీ వర్గాలలో ఆవేశం తీవ్రమవుతోంది. లోక్‌సభ ఎన్నికలలో పట్టు లేకున్నా కోలారు స్థానాన్ని వదులుకున్నామని ప్రస్తుతం చన్నపట్టణపై కుమారస్వామి ఒత్తిడి చేయడం సరికాదని పార్టీ సీనియర్ నేత అశ్వత్థనారాయణ అభిప్రాయపడ్డారు. బీజేపీ నేతలు నిర్వహించిన ప్రత్యేక సభలో ఆశావహుడు సీపీ యోగేశ్వర్ పాల్గొన్నారు. ఆయన ఇప్పటికే ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో వెనుకడుగు లేదని ప్రకటించారు. టిక్కెట్ దక్కని పక్షంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ప్రకటించారు. మరోవైపు జేడీఎస్ పార్టీ అంతర్గతంగా నిర్వహించిన సర్వేలో అనితా లేదా నిఖిల్ ఎవరు పోటీ చేసినా ఓటమి తప్పదనే సంకేతం వచ్చినట్లు తెలుస్తోంది. ఈ స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా రామనగరలో తమకు ఎదురులేదని నిరూపించు కునేందుకు డీకే శివకుమార్ సిద్ధమయ్యారు. చన్నపట్టణ స్థానానికి అభ్యర్థి ఎంపిక కోసం శనివారం డీకే శివకుమార్ ప్రత్యేకసభను జరిపారు. మాజీ ఎంపీ డీకే సురేశ్, ఎమ్మెల్సీలు పుట్టణ్ణ, ఎస్ రవి, మాజీ ఎమ్మెల్యే రాజు, ఎంసీ అశ్వథ్, దంతూరు విశ్వనాథ్, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు రెండు నామినేషన్లు

ఉప ఎన్నికలకు సంబంధించి రెండోరోజు శనివారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. శిగ్గావి నుంచి ఒకరు, చన్నపట్టణ నుంచి ఒకరు నామినేషన్ వేశారు. దీంతో శిగ్గావి నుంచి నలుగురు 6 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, చన్నపట్టణ నుంచి ఒక వ్యక్తి ఒక నామినేషన్ సమర్పించారు.

ఇద్దరు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

శాసనసభ మూడు స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించింది. శిగ్గావి నుంచి మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్ బొమ్మై, సండూరు నుంచి బంగారు హనుమంతు పేర్లను ఖరారు చేసింది. ఈమేరకు బీజేపీ అధిష్ఠానం శనివారం ప్రకటించింది. చన్నపట్టణ నుంచి ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదు. భరత్ బొమ్మై ఇంజనీరింగ్ పట్టభద్రుడు. రాజకీయంగా సక్రియంగా లేనప్పటికీ పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత తన రంగంలో రాణిస్తున్నారు. ఇక బంగారు హనుమంతు బీజేపీ ఎస్టీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసి గుర్తింపు పొందారు. సినిమా, వ్యవసాయంతోపాటు కాంట్రాక్టర్‌గా, కార్యకర్తగా రాణించారు. పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు.


అనితా కుమారస్వామి



శిగ్గావి అభ్యర్థి భరత్ బొమ్మై, సండూరు అభ్యర్థి బంగారు హనుమంతు

రికార్డులు..

గల్లంతు..!

- రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీలో రూ.19.34 కోట్ల గోల్‌మాల్..!
- మంత్రి సమీక్షలో బట్టబయలు
- మాజీ సీఈఓపై ఎఫ్ఐఆర్



బెంగళూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీలో రూ.19.34 కోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణలతో సొసైటీ మాజీ సీఈఓ ఆశాలతపై నందిని లే అవుట్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. కో-ఆపరేటివ్ సొసైటీల సమాఖ్య అధ్యక్షుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఓ ఆశాలత, ఆమె భర్త సోమశేఖర్, బంధువులు విజయ్‌కిరణ్ జే మంజునాథ్, వి సుజయ్, బీడీసీసీ బ్యాంకు, అపెక్స్ బ్యాంకు మేనేజర్లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. సమాఖ్య ఇన్‌చార్జ్ సీఈఓగా ఆశాలత 2018 నుంచి పనిచేస్తున్నారు. సొసైటీ ఆర్థిక వ్యవహారాలు అకౌంట్స్ విభాగాలపై సహకార శాఖ మంత్రి రాజణ్ణ ఈనెల 9న సమీక్ష జరిపారు. డిపాజిట్‌లతోపాటు ఇతరత్రా అంశాలపై చర్చించినప్పుడు ఆశాలత 19.34 కోట్ల రూపాయలకు సంబంధించిన రికార్డులు చూపలేకపోయారు. దీంతో సమాఖ్య అధ్యక్షుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


ఉప్పొంగి ప్రవహిస్తున్న విట్లాపుర చెరువు


బెనకాపురం వద్ద పొలాల్లో పారుతున్న వర్షపునీరు


ఉధృతంగా పారుతున్న దరోజీ చెరువు

ఉప్పొంగిన వాగులు, చెరువులు

కంప్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : బళ్లారి, విజయనగర జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా చేతికొచ్చిన పంటలు నూర్పిడి చేసే సమయంలో వర్షాలు కురుస్తున్నా యని, కల్లాల్లో పంట తడిచి నీటిపాలయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సండూరు తాలుకాలోని కళింగగేరికి చెందిన తిప్పేస్వామి మొక్కజొన్న పంట కల్లంలో తడిసి నీటిపాలయ్యింది. చేతికొచ్చిన పంట నీటిపాలవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో తడిసిన పంటు కాపాడుకోవడాకి నానా తంటాలు పడుతున్నారు. భారీ వర్షంతో విట్లాపురం చెరువు, దరోజీ చెరువు ఉప్పొంగి ప్రవహించి మరువ పారింది. హగరి బొమ్మనహళ్లి తాలుకాలో కూడా నీరు వర్షపాతం ఎక్కువై పొలాల్లో నీరు పారాయి. కంప్లి, కురుగోడు, ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. అధిక వర్షాలతో రైతులతో పాటు ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


కళింగేరి వద్ద నీట మునిగిన మొక్కజొన్నను కాపాడుకునేందుకు రైతుల తంటాలు

సంక్షిప్తం

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

అధికారులకు మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక రాంనగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఐదు మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ, చెరువుల అంశాలపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మురళీధర్‌రావు, డీఈ సఫ్రీన్, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ నాగరాజ, ఈఈలు పాల్గొన్నారు.

10 నుంచి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

అనంతపురం టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నవంబరు 10 నుంచి 15వరకు కడప డీఎస్ఏ స్టేడియంలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నారని, జిల్లా అభ్యర్థులు హాజరుకావాలని కలెక్టరు వినోద్‌కుమార్ సూచించారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్ ఆఫీస్ అసిస్టెంట్స్, స్టోర్ కీపర్ టెక్నికల్స్, అగ్నివీర్ 10వ తరగతి ట్రేడ్‌మెన్, 8వ తరగతి ట్రేడ్‌మెన్‌కు రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రాలు, అడ్మిట్‌కార్డులు తీసుకుని ర్యాలీలో పాల్గొవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి, అర్హత గలవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హంద్రీనీవా ఎస్ఈగా నాగరాజ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ప్రాజెక్ట్ ఎస్ఈగా నాగరాజ నియమితులయ్యారు. జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ సీఈగా ఉన్న నాగరాజకు హంద్రీనీవా ఎస్ఈగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకు ఎస్ఈగా ఉన్న దేసేనాయక్ నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఆయన ఆదివారం రిలీవ్ కానున్నారు. సోమవారం హంద్రీనీవా ఇన్‌చార్జి ఎస్ఈగా నాగరాజ బాధ్యతలు తీసుకుంటారు. హంద్రీనీవా డివిజన్-7 ఈఈగా డీఈ శ్రీనివాసులుకు, పెనుకొండ ఐబీ డివిజన్ ఈఈగా రాధాకృష్ణ, కదిరి డివిజన్ 11 ఈఈగా గంగాధర్‌ను నియమించారు.

గుంతకల్లు-చిగ్గాజుర్ ప్యాసింజరు రద్దు

గుంతకల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిగ్గాజుర్-గుంతకల్లు-చిగ్గాజుర్ ప్యాసింజరు (07585/86) రైలును డిసెంబరు రెండో వారం వరకూ రద్దుపరచనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హుబ్లీ రైల్వే డివిజన్‌లోని చిత్రదుర్గ-బేలేనహళ్లి సెక్షన్‌లో జరుగుతున్న పనుల కారణంగా అక్టోబరు 20 నుంచి డిసెంబరు 13వ తేదీ వరకూ (మధ్యలో కొన్ని తేదీలు మినహా) రద్దుపరచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అక్టోబరు 21, 26, 28, నవంబరు 2, 4, 9, 11, 16, 18, 23, 25, 30, డిసెంబరు 2, 7, 9 తేదీలలో మినహా మిగతా రోజుల్లో ఈ ప్యాసింజరు రైలును రద్దుపరిచామన్నారు.

లా కోర్సు కౌన్సెలింగ్ నిర్వహించాలి

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : లా కోర్సు ప్రవేశాల కౌన్సెలింగ్‌ను త్వరతగతిన నిర్వహించాలని నేచురల్ జస్టిస్ లీగల్ ఎయిడెడ్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనితను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆ సంఘం సభ్యులు పణిభూషణ, చంద్రభాస్కర్ మాట్లాడుతూ అడకమిక్ క్యాలెండర్ మేరకు గత నాలుగు సంవత్సరాలుగా న్యాయ విద్య ప్రవేశాలు కల్పించడంలేదన్నారు. అడ్మిషన్స్ ప్రక్రియ ఆలస్యం కావడంతో పాఠ్యాంశాలను తూతూ మంత్రంగా పూర్తిచేసి పరీక్షలు నిర్వహిస్తుండటంతో ఉత్తీర్ణత శాతం గననీయంగా పడిపోతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, జయరాజు, మధు పాల్గొన్నారు.

రీజనల్ కో ఆర్డినేటర్‌గా మిథున్‌రెడ్డి

అనంతపురం క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉమ్మడి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్‌గా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని ఆ పార్టీ నియమించింది. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి అనంతపురం, నెల్లూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా మిథున్‌రెడ్డిని నియమించినట్లు అందులో పేర్కొంది. గతంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రీజనల్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఎన్నికల అనంతరం వైవీ సుబ్బారెడ్డి పేరును ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. చివరికి మిథున్ రెడ్డిని నియమించారు.

కందికి తెగుళ్ల దెబ్బ



పూర్తిగా ఎండిన కంది మొక్కలు

ఉరవకొండ నియోజకవర్గంలోని నల్లరేగడి భూముల రైతులు నిత్యం పప్పుశనగ పంట సాగుచేస్తుంటారు. వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలించక నష్టాల పాలవుతుండడంతో ఈసారి చాలా మంది రైతులు పంట మార్పిడి చేసి చూద్దామని కంది పంట సాగుచేశారు. మొదట బాగా పెరిగిన పంటకు పూతదశలో విల్ట్, ఆకుమచ్చ తెగుళ్లు సోకడంతో ఎండిపోతోంది. దీంతో రైతులు మరోసారి నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- విడపనకల్లు, ఆంధ్రజ్యోతి

వందల ఎకరాల్లో ఎండుతున్న పంట

విల్ట్, ఆకుమచ్చ తెగుళ్లతో భారీ నష్టం

అధిక తేమతో కుళ్లుతున్న వేర్లు

ప్రతి ఏటా పప్పుశనగ సాగు చేసే రైతులు ఈసారి ఎక్కువగా కంది పంట సాగు చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, కూడేరు మండలాల్లో గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి కంది వైపు మొగ్గు చూపారు. ఎటు చూసినా కంది పైరు కనిపిస్తోంది. పప్పుశనగపై ఆశలు వదులకుని కందిని సాగు చేస్తే అదికూడా విల్ట్ తెగులుతో ఎండిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కంది పంట సాగు చేసి ఇప్పటికే మూడు నెలలయింది. ప్రస్తుతం పూత దశలో ఉండగా అధిక వర్షాలతో వేర్లు కుళ్లి పోతున్నాయి. ఇది విల్ట్ తెగులు అని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. విడపనకల్లు, వజ్రకరూరు, మండలాల్లో పైరు ఎండి పోతోంది. కొన్ని గ్రామాల్లోని పొలాల్లో సాళ్లకు సాళ్లు కంది మొక్కలు పూర్తిగా ఎండి పోయాయి. మాళాపురం గ్రామం వద్ద రామాంజనేయులు అనే రైతు పొలంలో కందికి విల్ట్ తెగులు సోకి పూత దశలో ఉన్న పంట ఎండి పోయింది. వేర్లు కుళ్లి పోయి మొక్కలు ఎండుతున్నాయి. చీకలగురికి గ్రామంలో హంద్రీనీవా కాలువ వైపు, ఎర్రనేల పొలాల్లోను కంది ఎండి పోతోంది. దీనికి తోడు పచ్చపురుగు ఆశించడంతో మొక్కలకు ఉన్న ఆకులు మొత్తం రంధ్రాలు పడిపోతున్నాయి. వివిధ రకాల రసాయనిక మందులు వాడినా విల్ట్ తెగులు, పచ్చపురుగు తగ్గటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజక వర్గంలో 69,627 వేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. గతంలో మిరప పంటకు విల్ట్ తెగులు సోకి వేల ఎకరాల్లో నష్టాల పాలయ్యారు.

మొక్కలు ఎండి పోతున్నాయి



రెండు ఎకరాల్లో కంది పంట సాగు చేశాను పచ్చపురుగుతో కొంత, విల్ట్ తెగులుతో కొంత ఎండి పోతోంది. ఎన్ని మందులు వాడినా విల్ట్ ఆదుపు కావటంలేదు. చేసేది లేక ఎండిన మొక్కలను తొలగించి పొలం గట్టుకు వేస్తున్నాం. ఇది ఇలాగే ఉంటే ఎకరాలకు ఎకరాలు ఎండిపోయి పూర్తిగా నష్టపోతాం. పంటల బీమా కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఎ. ఓబుళేసు, మాళాపురం

అధిక రసాయనిక ఎరువుల వల్లే తెగుళ్లు

రైతులు తమ పొలాల్లో అధిక రసాయనిక ఎరువులు వాడకం వల్లే విల్ట్ తెగులు సోకుతోంది. పంట సాగుకు ముందు పొలాల్లో పశువుల ఎరువులు వాడడం లేదు. ఈసారి కంది పంటకు సోకిన తెగులును నివారించడం సాధ్యం కాదు. విల్ట్ తెగులు నివారణకు వేసవి సేద్యంలో ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పేడ ఎరువును వాడాలి. టన్ను పేడ ఎరువుకు 10 కిలోల ట్రైకో డెర్మ వెరడిని వాడాలి. ట్రైకో డెర్మవెరడిని పేడ ఎరువులో 21 రోజులు నానబెట్టిన తరువాత పొలంలో చల్లుకోవాలి. వేసవిలో లోతు దుక్కులు చేసుకుంటే వైరస్‌ను నివారించవచ్చు. విల్ట్ తెగులు సోకిన మొక్కలను తొలగించి పొలం గట్లపై వేసి కాల్చి బూడిద చేయాలి. లేదంటే వైరస్ మొత్తం పొలంలోని మొక్కలకు సోకే అవకాశం ఉంది. అధిక దిగుబడులు రావాలని విచ్చలవిడిగా ఎరువులు వాడటం వల్లే పంటలు ఎండుతున్నాయి.

- హెచ్.పెన్నయ్య, మండల వ్యవసాయ అధికారి, విడపనకల్లు



కుళ్లిన వేర్లు



రంధ్రాలు పడిన ఆకులు

పంట మార్చినా నష్టాలే



నేను ఐదెకరాల్లో కంది పంట సాగు చేశాను. వర్షాలు అధికంగా రావటం, తేమ ఎక్కువ కావటంతో పైరు ఎండి పోతోంది. బూడిద తెగులు, విల్ట్ తెగులు అంటున్నారు. గతంలోను మిరప పంటకు విల్ట్ తెగులు సోకి లక్షల్లో నష్టాలు పాలయ్యాం. ఇప్పుడు పంటలను మార్పు చేసి కందిని సాగు చేసినా విల్ట్ వదలటం లేదు. ఎక్కపడితే అక్కడ కంది మొక్కలు ఎండి పోతున్నాయి. ఏమి చేయాలో తెలియడం లేదు.

- జి.విజయ్, వి.కొత్తకోట

ఎన్ని మందులు వాడినా ఫలితం లేదు



నేను ఎనిమిది ఎకరాల్లో కంది పంటను సాగు చేశాను. నెల రోజుల నుంచి కంది పైరు ఎండుతోంది. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకుండా పోతోంది. ప్రస్తుతం పూత దశలో ఉంది. ఉన్నట్లుండి ఎండిపోతుండడంతో ఏమి చేయాలో తెలియక అలాగే వదిలేశాను. ప్రతి ఏటా పప్పుశనగ సాగు చేసేవాడిని, ఈసారి పంట మార్పిడి చేస్తే బాగుంటుందని అందరితో పాటు కంది సాగు చేస్తే విల్ట్ తెగులు సోకి ఎండుతోంది.

- ఎం.రామాంజనేయులు, పెద్ద కొట్టాలపల్లి

నిలకడలేని టమోటా ధరలు

ఊరించి ఉసూరుమనిపిస్తున్న వైనం

మొన్నటి వరకు 16 కిలోల బాక్స్ రూ.800 నుంచి రూ.1000

నేడు రూ. 350 నుంచి రూ.400కు పతనం





టమోటాను బాక్సుల్లోకి నింపుతున్న కూలీలు

కళ్యాణదుర్గం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షం దెబ్బకు టమోటా ధరలు ఊరించి ఉసూరుమనిపిస్తున్నాయి. మొన్నటి వరకు అనంతపురం, కర్ణాటకలోని కోలార్ టమోటా మార్కెట్లలో 16 కిలోల బాక్స్ ధర రూ.800 నుంచి రూ.1000 వరకు పలికాయి. అవే ఇప్పుడు రూ. 350 నుంచి రూ. 400 పడిపోయాయి. ఈ ధరలు ఇంకా తగ్గే అవకాశాలు ఉన్నాయి. వారం రోజుల వ్యవధిలోనే అమాంతంగా ధరలు పడిపోయాయి. ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 390 ఎకరాలకు పైగా టమోటా సాగు చేశారు. ఎకరాకు రూ. లక్ష వరకు ఖర్చు చేసి, ఒక్కొక్క రైతు సరాసరి రెండున్నర ఎకరాలకు పైబడి సాగు చేశారు. టమోటా పంటలన్నీ కోతకు వస్తున్న సమయంలో ఇలా ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి కూడా అమాంతంగా పెరగడంతో మార్కెట్లకు భారీగా టమోటా చేరుతోంది. వర్షం దెబ్బతో బంగ్లాదేశ్‌కు ఎగుమతి నిలిపివేయడంతోనే ధరలు నిలకడగా ఉండడం లేదని రైతులు చెబుతున్నారు. టమోటా కొనుగోలుకు మొన్నటి వరకు వ్యాపారులు ఎగబడ్డారు. ధరలు ఇలాగే ఉంటాయని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. వారం రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం తగ్గుముఖం పట్టాయి.

వారంలోనే తగ్గిన ధరలు



నాకున్న మూడు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశాను. వారం రోజుల క్రితం 16 కిలోల టమోటా బాక్స్ ధర రూ.800 నుంచి రూ.1000 వరకు అమ్ముడుపోయింది. అదే ధర ఇప్పుడు రూ. 350 నుంచి రూ.400కు పడిపోయింది. ఇలా ధర ఒక్కసారిగా పడిపోవడంతో భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నాం.

- నగేష్, కరిగానిపల్లి



తోటలోనే మాగిపోయిన టమోటా

వర్షం దెబ్బతోనే పతనం



గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం దెబ్బకు టమోటా ధర పడిపోతోంది. ఈ ధరలు ఇలాగే ఉంటే పెట్టుబడి కూడా రాదు. నాకున్న రెండు ఎకరాల్లో సుమారు రూ. 2 లక్షలు వరకు ఖర్చు చేసి టమోటా పంటను సాగు చేశాను. మొన్నటి వరకు రూ. 800కు పైబడి 16 కిలోల బాక్స్ కొన్నారు. ప్రస్తుతం రూ. 400కు పడిపోయింది. పడిలేస్తున్న ధరలు చూస్తే మాలాంటి చిన్నకారు రైతుల పరిస్థితి ఏమి కావాలో అర్థం కాలేదు.

- హరీష్, కరిగానిపల్లి

యాపారం జోరు..!

అంగన్‌వాడీ పోస్టుల చుట్టూ బేరాలు

రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ

జిల్లా వ్యాప్తంగా 84 పోస్టులు ఖాళీలు

23 నుంచి ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'యాపారం' జోరందుకుంది. ఒక్కో పోస్టు లక్షలు పలుకుతోంది. కొందరు మధ్యవర్తులు, దళారులు అధికార పార్టీ నాయకులు కొందరిని అడ్డుపెట్టుకుని అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు బేర సారాలు ఆడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రాజెక్టుల్లో 84 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నెల 23 నుంచి అభ్యర్థులకు రెవెన్యూ డివిజన్ల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అయితే చాలా చోట్ల అభ్యర్థులకు పోస్టులు ఇప్పిస్తామని మధ్యవర్తులు బేరాలు ఆడుతున్నారు. రూ. 2 లక్షల నుంచి రూ. 5లక్షల వరకూ పోస్టులను, సెంటర్‌ను బట్టి రేట్ ఫిక్స్ చేసి బేరాలు ఆడుతున్నారు. దీంతో పోస్టులు ఏమేరకు పారదర్శకంగా భర్తీ అవుతాయనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

అంగన్‌వాడీ పోస్టులకు 303 దరఖాస్తులు

అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గతనెలలో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 1వ తేదీ వరకూ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు 303 దరఖాస్తులు వచ్చాయి. 9 వర్కర్ పోస్టులకు 68 దరఖాస్తులు, నాలుగు మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 11 దరఖాస్తులు, 71 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు 224 దరఖాస్తులు వచ్చాయి. డివిజన్ల వారీగా పరిశీలిస్తే... అనంతపురం డివిజన్‌లో 102 దరఖాస్తులు, గుంతకల్లు డివిజన్‌లో 66 దరఖాస్తులు, కళ్యాణదుర్గం డివిజన్‌లో 56 దరఖాస్తులు వచ్చాయి.

23 నుంచి ఇంటర్వ్యూలు...

అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 23 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అనంతపురం రెవెన్యూ డివిజన్‌పరిధిలోని అభ్యర్థులకు 23న ఉదయం 10 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు చేస్తారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు 24న ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు 25న ఉదయం 10 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

ప్రాజెక్టుపేరు	పోస్టులు
అనంతపురం అర్బన్	8
శింగనమల	6
నార్పల	9
అనంతపురం రూరల్	10
తాడిపత్రి	14
గుత్తి	5
ఉరవకొండ	12
కళ్యాణదుర్గం	6
కణేకల్లు	5
కంబదూరు	7
రాయదుర్గం	2
మొత్తం 11 ప్రాజెక్టులు	84

రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచే బేరాలు ఊపందుకున్నాయి. అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు సగటున రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకూ బేరాలు సాగుతున్నాయి. కొన్ని చోట్ల రూ. 5 లక్షలు కూడా పలుకుతోంది. మినీ వర్కర్ పోస్టుకు సైతం రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలు వరకూ నడుస్తోంది. ఆఖరికి ఆయా పోస్టుకు సైతం రూ. 2 లక్షలు, ఆపైన కూడా రేట్ ఫిక్స్ చేసి దళారులు బేరాలు సాగిస్తున్నారు. శింగనమల, తాడిపత్రి, అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, కణేకల్లు, గుత్తి, కంబదూరు, రాయదుర్గం, నార్పల, కళ్యాణదుర్గం ఇలా ప్రతి ప్రాజెక్టు పరిధిలో కొందరు దళారులు, ద్వితీయశ్రేణి నాయకులు కొందరు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో సిఫార్సు లెటర్లు ఇప్పిస్తామని, ఐసీడీఎస్ అధికారులకు ఫోన్లు చేయిస్తామని చెప్పి భారీగా బేరాలు సాగిస్తున్నాయి. కొందరు సంఘాల నాయకులు కూడా ఇందులో తలదూర్చి చక్రం తిప్పాలని చూస్తున్నారు. అభ్యర్థుల ఇంటర్వ్యూలకు మరో మూడు రోజులు మాత్రమే సమయం ఉండటంతో...ఈ బేరాలు జోరందుకున్నాయి. మరి అధికారులు ఏ మేరకు పాదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారో? అక్రమాలను ఏ విధంగా కట్టడి చేస్తారో చూడాలి.



ఐసీడీఎస్ పీడీ కార్యాలయం

ఏసీబీకి ఫిర్యాదు చేయండి

పోస్టులను పారదర్శకంగా భార్తీ చేస్తాం. అభ్యర్థులను ఎవరైనా డబ్బులు అడిగి ప్రలోభ పెడితే వెంటనే ఏసీబీ అధికారులు ఫిర్యాదు చేయండి. అభ్యర్థులు నేరుగా ఏసీబీ అధికారులను సంప్రదించవచ్చు.

- శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ

చూసొద్దాం రండి..!

డ్యాం చూద్దాం.. చేప తిందాం..



నూరూరించే చేపలు పులుసు, చేపల రోస్ట్

కూడేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఒత్తిడితో కూడిన జీవనం నుంచి కాస్త రిలాక్స్ కోసం చాలా మంది ఏదో ఒక పిక్నిక్‌కు వెళ్లాలని భావిస్తుంటారు. అలాంటి వారికి పీఏబీఆర్ డ్యాం మంచి ఆప్షన్‌గా కనిపిస్తోంది. ఇక్కడ నిండుగా కనిపించే నీటిని చూసి పిల్లలు, పెద్దలు ఉల్లాసం పొందుతారు. ముఖ్యంగా ఇక్కడ ఇక్కడ దొరికే చేపలతో తయారు చేసే పులుసు, రోస్టు ఎంతో రుచికరంగా ఉంటుంది. పీఏబీఆర్ డ్యాంలో చేపలను తిన్న వారు ఆ రుచికి ఫిదా అవాల్సిందే. డ్యాంను చూడటానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చేపలతో వివిధ రకాల వంటకాలు తయారు చేయించుకొని అక్కడే ప్రశాంతంగా భోంచేస్తుంటారు. మరికొందరు ఇంటికి పార్సల్ తీసుకెళ్తారు. సెలవు రోజుల్లో డ్యాం వద్దకు పదుల సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాల్లో సందర్శకులు వస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడి, పాడి అలసి ఇంటికి వెళ్తుంటారు. మరి కొందరు ఇక్కడే పుట్టినరోజు వేడుకలు సైతం జరుపుకుంటుంటారు. మరి మీకు వెళ్లాలని ఉంటే కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఓ రోజు వెళ్లి సరదాగా గడిపేయండి.



సిద్ధం చేస్తున్న తయారీదారులు

అమ్మపేరుతో మొక్క నాటాలి

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



మొక్కలు నాటుతున్న సత్యకుమార్ యాదవ్, లాల్‌సింగ్ ఆర్య, గుడిసె దేవానంద్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదించిన పర్యవరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ వారి అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి పెంచాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'అమ్మ పేరుతో ఒక మొక్క' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మందల శాంతకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మంత్రి సత్యకుమార్ యాదవ్‌తోపాటు జాతీయ దళిత మోర్చా అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య, రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అకాల వర్షాలు తదితర వాటిని నియంత్రించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. స్ఫూర్తిదాయకంగా ప్రధాని మోదీ మొక్కనాటి తన తల్లి హీరాబెన్ పేరును నామకరణం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకేశివశంకర్, జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్, బీజేపీ నాయకులు లలిత్‌కుమార్, సూర్య, నాగేంద్ర, జయలక్ష్మి, రామ్‌దాస్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్ట విరుద్ధం

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గర్భంలో ఉన్నది ఆడ శిశువైనా, మగ శిశువైనా.. బయటకు చెప్పడం నేరమని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి అన్నారు. తన చాంబర్‌లో శనివారం గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం గురించి జిల్లా కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేయకుండా నిత్యం నిఘా ఉంచాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ చట్ట విరుద్ధమని, అయినా కొన్నిచోట్ల ఇలాంటి స్కానింగ్ పరీక్షలు జరగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. అనుమానం ఉన్న స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై నిఘా వేయాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తేలితే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని, డాక్టర్లు, టెక్నీషియన్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి జైలుకు పంపుతామని హెచ్చరించారు. లింగ వివక్ష సరికాదని, కొడుకు, కూతురు సమానమేనని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని శాఖలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో లింగనిర్ధారణ, బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆర్బీటీ వైద్యులు దుర్గేష్, ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ యుగంధర్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ రేణుక, డాక్టర్ రవికుమార్, డాక్టర్ లక్ష్మీదేవి, డెమోలు త్యాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

శేషేంద్రశర్మ (జయంతి)



'యుగకవి'గా ప్రసిద్ధి చెందిన సాహితీ విమర్శకుడు శేషేంద్ర శర్మ 1927 అక్టోబరు 20న నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నాగరాజుపాడులో జన్మించారు. సాహితీవేత్త, వక్త. సంస్కృత, తెలుగు, ఆంగ్లభాషల్లో పండితుడు. ఆధునిక సాహిత్యంపై తనదైన ముద్రవేసి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. 'నా దేశం - నా ప్రజలు' రచన 2004లో నోబెల్ సాహిత్యానికి నామినేట్ అయ్యింది. 2007 మే 30న కన్నుమూశారు.

రాజబాబు (జయంతి)



'శతాబ్దపు తెలుగు హాస్య నటుడు'గా పేరొందిన రాజబాబు 1937 అక్టోబరు 20న రాజ మండ్రిలో జన్మించారు. పూర్తిపేరు పుణ్యమూర్తుల అప్పలరాజు. నటుడు, నిర్మాతగా రాణించారు. తెలుగు ఉపాధ్యాయుడిగా ఆరంభించి నాటక రంగం నుంచి వెండితెరపై సత్తా చాటుకున్నారు. 'రాజబాబు - రమా ప్రభ' జోడీ మంచి హాస్య జంటగా పేరొందింది. వరు సగా ఏడుసార్లు ఫిలింఫేర్ అవార్డు పొందిన హాస్య నటుడు. 20ఏళ్లలో 589 సినిమాలలో నటించారు. 10 నంది అవార్డులు, 15 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందు కున్నారు. 1983 ఫిబ్రవరి 14న కన్నుమూశారు.

వీరేంద్రసెహ్వాగ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత వీరేంద్రసెహ్వాగ్ 1978 అక్టోబరు 20న హర్యానాలో జన్మించారు. క్రికెట్‌లో ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా సత్తా చాటుకున్నారు. ఢిల్లీ డేర్ డెవిల్స్‌జట్టుకు, ఢిల్లీ రంజీ జట్టుకు వైస్ కెప్టెన్‌గా, కెప్టెన్‌గాను వ్యవహరించారు. భారతజట్టుకు కొంత కాలం కెప్టెన్సీ బాధ్యతలు వహించారు. వన్డే మ్యాచ్‌లోనూ, అంతర్జాతీయ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ ట్రిపుల్ సెంచరీ చేసిన ఘనత. అర్జున అవార్డుతోపాటు పలు ట్రోఫీలు పొందారు. 'విజ్డెన్ లీడింగ్ క్రికెటర్ ఇన్ ది వరల్డ్'గా 2008, 2009లో తొలిగౌరవం పొందిన భారత క్రికెటర్. 2023లో ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేంలో గుర్తింపు పొందారు.

నగరమంతటా ముసురు

» భారీ వర్షంతో రోడ్లు అధ్వానం



గొడుగులతో వెళ్తున్న విద్యార్థినులు ఇలా...

బెంగళూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో బెంగళూరు నగర వ్యాప్తంగా శనివారం ముసురుపట్టింది. రాష్ట్రమంతటా వర్షాలు కురుస్తున్నాయి. తీరప్రాంత జిల్లాల్లో ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురవగా బెంగళూరుతోపాటు వివిధ జిల్లాల్లో కొద్దిపాటి వర్షం కురిసింది. నగరంలో ఉదయం నుంచి నాలుగైదు విడతలుగా వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో జోరుగా వర్షం కురవడంతో రోడ్లపై నీరు ప్రవహించింది. వర్షం ప్రభావంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎటు చూసినా ప్రజలు గొడుగులు పట్టుకుని తిరిగారు. కళాశాలలు యథావిధిగా కొనసాగాయి. కొన్ని పాఠశాలలు సెలవు ఇచ్చాయి. ఇదే పరిస్థితి మైసూరు, మండ్య, హాసన్‌లలోనూ కొనసాగింది.

దొమ్మసంద్రలో...

దొమ్మసంద్ర, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళిలో శనివారం ఉదయం కురిసిన భారీ వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. ఇప్పటికే నగరంలో రెండు మూడు రోజులుగా వాన కురుస్తుండగా తాజాగా కురిసిన వర్షంతో రోడ్లు మరింత అధ్వానస్థితికి చేరాయి. దొమ్మసంద్ర సర్కిల్ సహా చుట్టుపక్కల రోడ్లపై పలు చోట్ల గుంతలు ఉండడంతో వర్షపునీరు చేరి కుంటలను తలపించాయి. రాజకాలువలను ఆక్రమించి నీరు సజావుగా ప్రవహించకుండా చేయడమే రాష్ట్ర, జాతీయ రహదారులకు నీరు నిలుస్తోందనే విమర్శలు ఉన్నాయి. వర్షపునీరు సజావుగా వెళ్లేలా ప్రజాపనులశాఖ సరైన కార్యాచరణ చేపట్టలేదని ప్రజలు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఆరు సంవత్సరాలలో కొన్నిచోట్ల 2-3 అడుగుల మేర గోతులు పడ్డాయి. నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా గుంతలను పూడ్చడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. బెంగళూరు నగరానికి 20 కిలోమీటర్ల దూరంలోని సర్జాపుర రోడ్డు అభివృద్ధి పట్ల అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఇతర ప్రజా ప్రతినిధులు ఇక్కడి రోడ్ల స్థితిగతులను పరిశీలించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.





గొడుగు ఆసరాగా ట్రాఫిక్ సిబ్బంది విధులు



వర్షపునీటిలో దారి ఏదో.. గుంతలు ఏవో..

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బంగారపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పురసభ పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు కార్యాచరణ కొనసాగుతోంది. గత వారం పురసభ అధ్యక్షుడు గోవింద హెచ్చరికలు జారీ చేశారు. పలు చోట్ల వ్యాపారులు ఫుట్‌పాత్‌ను ఆక్రమించారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులతో కలసి పురసభ అధికారులు శనివారం కార్యాచరణ నిర్వహించారు. పొక్లైనర్‌లు, ట్రాక్టర్‌లతో సిబ్బంది రంగంలోకి దిగారు. ఫుట్‌పాత్‌పై ఉంచిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పురసభ ఆరోగ్య అధికారి గోవిందరాజు మాట్లాడుతూ పలువురు వీధి వ్యాపారులు పండ్లు, కూరగాయలను ఫుట్‌పాత్‌ను ఆక్రమించి విక్రయిస్తుండడం, వీటి కారణంగా ఇష్టం వచ్చినట్టు వాహనాలను పార్కింగ్ చేయడంతో రాకపోకలకు సమస్యగా మారిందన్నారు. అనేకమంది వ్యాపారులు తమ దుకాణానికి మించి వస్తువులను ఫుట్‌పాత్‌పై ఉంచారని తద్వారా పాదచారులు ఇతరులకు ఇబ్బందిగా మారిందన్నారు. వీటికి సంబంధించి ప్రజలనుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇప్పటికే ఒక విడత హెచ్చరికలు జారీ చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఫుట్‌పాత్‌పై ఉంచిన వస్తువులను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన నిర్మాణాలు తొలగిస్తున్నామన్నారు. కువెంపు సర్కిల్ నుంచి బజార్ రోడ్డు, రైల్వే స్టేషన్ వరకు పాదచారులు, ప్రయాణీకుల సౌకర్యార్థం పలు చోట్ల ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు.



పొక్లైనర్‌తో తొలగింపు ఇలా...



ఆక్రమణల తొలగింపు కార్యాచరణ ఇలా...

నేషనల్ ఏరోక్వెస్ట్ పోటీల్లో పీఈఎస్ విద్యార్థికి ర్యాంకు



కృతార్థ్‌కు ప్రత్యేక జ్ఞాపిక అందచేస్తున్న ఆర్మీ అధికారులు

బెంగళూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరిగిన ఏరోక్వెస్ట్ పోటీల్లో పీఈఎస్ యూనివర్సిటీలో ఐదో సెమిస్టర్ ఈసీఈ విద్యార్థి కృతార్థ్ విజేతగా నిలిచారు. టెరిటోరియల్ ఆర్మీ సైబర్ క్వెస్ట్ 2024లో మూడు విభాగాల్లో నిర్వహించింది. ఇందులో తొలి రౌండ్‌లో ఫస్ట్ పర్సన్ వ్యూ పద్ధతిన నిర్వహించారు. అన్ని విభాగాల్లోనూ రాణించిన కృతార్థ్ విజేతగా ఎంపిక కావడంపై ఆర్మీ అధికారులు ప్రత్యేకంగా షీల్డ్‌తో సత్కరించారు. యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

జోరుగా బీజేపీ సభ్యత్వనమోదు



సభ్యత్వ నమోదులో సీకల్ రామచంద్రగౌడ

శిడ్లఘట్ట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీని మరింత బలోపేతం చేయడంతోపాటు దేశాన్ని అభివృద్ధి దిశగా సాగేందుకు ప్రజలంతా సహకరించాలని బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బశెట్టిహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని గౌడనహళ్ళి, బశెట్టిహళ్ళి, కంబాళహళ్ళి, కెంపనహళ్ళి తదితర గ్రామా లలో బీజేపీ సభ్యత్వ నమోదు సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచమంతా భారత్‌వైపు ఆసక్తిగా చూసేలా దేశాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్తున్న ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. అందుకే విశ్వనాయకుడిగా పేరొందారన్నారు. బీజేపీకి మరింతశక్తిని చ్చేలా సభ్యులుగా చేరాలని కోరారు. గ్రామీణ హోబళి బీజేపీ అధ్యక్షుడు సీకల్ ఆనంద్‌గౌడ, పురుషోత్తమ్, వెంకటేశ్, అభిజిత్, పురుషోత్తమ్, ముంగారు రామకృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 6న ఉచిత సామూహిక వివాహాలు



ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బాగేపల్లి తాలూకాలోని ఎస్ఎన్ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 22వ వార్షిక ఉచిత సామూహిక వివాహ మహోత్సవం జరగనుందని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ పట్టణ సమీపంలోని పురాణ ప్రసిద్ధ గడిదంలోని లక్ష్మీవెంకటరమణస్వామి సన్నిధిలో డిసెంబరు 6న ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తాలూకాలో సుమారు 25ఏళ్లుగా సమాజసేవలో ఉన్నానని, ఇదివరకు తన ట్రస్టు తరఫున 21సార్లు ఉచిత సామూహిక వివాహాలు జరిపించామన్నారు. తద్వారా 7500 మందికిపైగా వధూవరులు దాంపత్య జీవనంలోకి అడుగుపెట్టారన్నారు. 3100 సీమ ఆవులను బహుమతిగా ఇచ్చామన్నారు. తన ఆరాధ్యదైవం గడిదం లక్ష్మీ వెంకటరమణస్వామి సన్నిధిలో గత ఏడాది జరిగిన ఉచిత సామూహిక వివాహాల్లో తన ఏకైక కుమారుడు అభిషేక్ సుబ్బారెడ్డి పెళ్లి నిర్వహించడం దైవ ప్రేరణగా భావిస్తానన్నారు. సామూహిక వివాహాల్లో పాల్గొనే వధువుకు 18, వరుడికి 21ఏళ్లు నిండాలని స్పష్టం చేశారు. వయస్సు ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత అధికారుల ద్వారా సమర్పించాల్సి ఉంటుందన్నారు. వధూవరుల పూర్తి చిరునామా స్పష్టంగా అర్జీలో నమోదు చేయాలని, అలాగే వధూవరుల అంగీకారంతోపాటు తల్లిదండ్రుల సమ్మతి పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. అనంతరం వచ్చే అర్జీలను పరిగణనలోకి తీసుకోబడదన్నారు. సామూహిక వివాహాల్లో పాల్గొనదలిచే వధూవరులకు బాగేపల్లి, గుడిబండ, చేళూరు తాలూకాలకు చెందినవారికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. వధూవరులకు పెళ్లిబట్టలు, తాళి, కాలి ఉంగరం, సీమ ఆవు బహూకరిస్తామని, పాల్గొనేవారికి భోజన వ్యవస్థ ఉంటుందన్నారు. కాగా అర్హులైన వారికి ప్రభుత్వం నుంచి రూ.50వేల ప్రోత్సాహం అందేలా ప్రయత్నం చేస్తామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి చెందిన వారికి భూమి ఉంటే బోరుబావి తవ్విస్తామన్నారు. ఆసక్తిగల వారు నవంబరు 25లోగా ట్రస్టు కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

74ఏళ్ల వృద్ధుడికి అరుదైన శస్త్ర చికిత్స

బెంగళూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నాలుగైదు రోజులుగా ఛాతీలో నొప్పితో 74 ఏళ్లవృద్ధుడు నగరంలోని ఏస్టర్ ఆసుపత్రిలో చేరగా అరుదైన శస్త్ర చికిత్స చేశామని డాక్టర్ సంజయ్‌భట్ ప్రకటించారు. అతడికి రెండు ప్రధాన కరోనరీ ఆర్టరీ బ్లాక్‌లు ఉన్నట్టు గుర్తించామన్నారు. వయసు పైబడిన కారణంతో ఇతరత్రా సమస్యలు ఉండడంతో ఏంజియోగ్రామ్ పద్ధతిన శస్త్ర చికిత్సలు చేశామన్నారు. రెండువైపులా రక్త ప్రసరణకు సమస్య ఉన్నట్టు గుర్తించామన్నారు. అందుకే చికిత్స తర్వాత అబ్జర్వేషన్‌లు ఉంచామన్నారు. ప్రస్తుతం అతను కోలుకున్నాడన్నారు.

గృహాలంకరణకు పెరుగుతున్న ఆదరణ

బెంగళూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనశైలి తోపాటు నివాసాలను అత్యంత సుందరంగా తీర్చుకునేందుకు ప్రాధాన్యత ఇస్తున్న అన్ని వర్గాల ప్రజలు గృహాలంకరణ పట్ల మొగ్గు చూపుతున్నారని సుగుత్సన్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ ఎండీ అనిల్ రాణా అభిప్రాయపడ్డారు. జపాన్‌కు చెందిన సుగుత్సన్ సెంటర్‌ను యూనిటీ బిల్డింగ్స్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్‌రాణా మాట్లాడుతూ 1930లో జపాన్‌లో సుగు త్సన్ సంస్థను ప్రారంభించారన్నారు. వాస్తు, ఇంటీరియర్ డెకరేషన్స్‌కు జపాన్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అందుకు అనుగుణంగానే సంస్థ అభివృద్ధి చేసిందన్నారు. బెంగళూరు నగరం ఓ మినీ ప్రపంచంలాంటిదని అందుకే సెంటర్‌ను ఏర్పాటు చేశా మన్నారు. ఆర్ గణేశ్‌కుమార్, కిరణ్ గాలాలు పాల్గొన్నారు.

ఉర్దూపాఠశాల ప్రగతికి శ్రీకారం



పెచ్చులూడిన పైకప్పు పరిశీలనలో మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

చింతామణి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డు కేఆర్ లే అవుట్‌లోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల భవనం దుస్థితికి చేరుకోవడంపై ఉన్నత విద్యాశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ స్పందించారు. శనివారం పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పలు చోట్ల పైకప్పు పెచ్చులూడి ఉండడాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్థానిక ముస్లిం ప్రముఖుల చొరవతో ఇక్కడ ఉర్దూ పాఠశాల నిర్మించినట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం దుస్థితికి చేరుకోవడంతో రూ.13లక్షలతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నగరసభ అధ్యక్షుడు జగన్నాథ, ఉపాధ్యక్షురాలు రాణియమ్మ, నగరసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రి ఆశయం కోసం అనాథాశ్రమం



మీడియాతో లక్ష్మణరావు తదితరులు

చేళూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకాలోని చిలకలనేర్పు సమీపానగల మించిళ్ళపల్లి క్రాస్ వద్ద గ్రామానికి చెందిన నరసింహప్ప కుమారుడు లక్ష్మణరావు నేతృత్వంలో అనాథ బ్రాహ్మణులకోసం వృద్ధాశ్రమాన్ని నిర్మిస్తున్నారు. తన సొంత స్థలంలో ఈశ్వరుడి ఆలయం నిర్మిస్తున్నారు. లక్ష్మణరావు మాట్లా డుతూ తండ్రి ఆశయం కోసం తమవంతు కృషి చేస్తు న్నామన్నారు. భవనం పనులు పూర్తి కాగానే ఆలయం కూడా ప్రారంభిస్తామన్నారు.

నేలకొరిగిన ద్రాక్ష తోట

కూడేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని హంసాపల్లి గ్రామంలో ఓ ద్రాక్షతోట నెలకొరిగింది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెండెకరాల ద్రాక్ష తోట నేల కొరిగింది. ఐదు లక్షల పెట్టుబడి పెట్టి రెండెకరాల్లో ద్రాక్ష పంట సాగు చేశాడు. దిగుబడి ఆశాజనకంగానే వచ్చింది. అయితే మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి శనివారం తెల్లవారుజామున పందిరి సహా పంట మొత్తం నేలకొరిగింది. దీంతో దాదాపు రూ.15లక్షల వరకు పంట నష్టం జరిగిందని రైతు వాపోయాడు. పెట్టుబడి ఐదులక్షలు, పంట నష్టం మరో పది లక్షలుంటుందని రైతు శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. హార్టికల్చర్ అధికారి నెట్టికంఠయ్య తోటను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

బీటీపీకి పెరుగుతున్న వరద



గుమ్మఘట్ట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భైరవాని తిప్ప రిజర్వాయర్‌కు వరదనీరు పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం రెండు టీఎంసీలు (1655 అడుగులు). కాగా శనివారం సాయంత్రానికి 1.2 టీఎంసీల నీరు (1649.4 అడుగులకు) చేరింది. కర్ణాటక పరిసర ప్రాంతాల్లో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు వేదవతి హగరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రాజెక్టుకు వరదనీటి ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టు కింద 12వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టులో నీరు చేరుతుండటంతో ఆయకట్టు రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

టమోటా కిలో రూ.43

అనంతపురంరూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్ లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.43తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 2250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.28, కనిష్ఠ ధర రూ.16 పలికినట్లు ఆయన తెలిపారు.



మానవసేవే సాయిసేవ



పాటలు పాడుతున్న భక్తులు


● సత్యసాయి సేవా సంస్థల ఉత్తర కర్ణాటక ప్రెసిడెంట్ పద్మనాభపాయ్



పుట్టపర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మానవసేవే సాయిసేవ అని సత్యసాయిబాబా చూపిన సేవా మార్గంలో పయనిస్తూ, సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని సత్యసాయి సేవా సంస్థల ఉత్తర కర్ణాటక ప్రెసిడెంట్ పద్మనాభపాయ్ పేర్కొన్నారు. సాయికుల్వంత్ సభా మంటపంలో శనివారం ఉత్తర కర్ణాటక భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొదట సేవాసంస్థల అధ్యక్షుడు ఉత్తర కర్ణాటకలో చేపట్టిన సేవా కార్యక్రమాలు వివరించారు. సత్యసాయి బోధించిన మేరకు విద్యా, వైద్యం, తాగునీటి సేవలు అందిస్తున్నామన్నారు. 22 పాఠశాలలో 1000 మంది విద్యార్థులకు విద్యాజ్యోతి కార్యక్రమం ద్వారా విద్యను అందిస్తున్నామని, యువతకు సాంకేతిక విద్యపై పలు శిక్షణా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రముఖ సంగీత గాయని సంగీత రాజేశ్‌బండేఖర్ బృందం తమ గానంతో భక్తులను పరవశింపజేశారు. అనంతరం సేవా దళ్ బృందం భక్తిగీతాల ఆలాపన చేపట్టారు. గాయకులను ఆర్‌జే రత్నాకర్ ఘనంగా సత్కరించారు.



సంగీత కచేరి నిర్వహిస్తున్న సంగీత రాజేశ్ బండేఖర్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.91	1,612.57
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	73,241	228
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	74,025	10,505
సామర్థ్యం (టీఎంసీలు)	101.42	42.90

నడిరోడ్డుపైనే పశువులు

● పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు
● ప్రమాదాల బారిన వాహనదారులు



అనంతపురం రోడ్డులో పశువుల సంచారం

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రధాన రోడ్లలో వీధి పశువులు విచ్చలవిడిగా తిరుగుతుండంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరంలోని ప్రధాన సర్కిళ్లలో వీధి పశువులు పదుల సంఖ్యలో తిష్టవేసి రాత్రివేళల్లో రోడ్లపైనే పడుకోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ విషయంపై నిత్యం నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల నాయకులు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా... అటువైపు తిరిగి చూడలేదని మండి పడుతున్నారు. వీధుల్లో పశువులను వదిలితే యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా వారు ఖాతరు చేయడంలేదు. వీధిపశువులను స్థానికంగా ఉండే గోశాలలకు గాని, లేదా ఇతర ప్రాంతాలకు తరలించి ప్రధాన రోడ్లపై వాహన సంచారానికి అనుకూలం చేయాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బోనులో చిక్కిన నల్లముచ్చు



కంప్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం కంప్లి పట్టణానికి చెందిన తిప్పేస్వామిని కొండముచ్చు దాడి చేసి గాయపరచిన విషయం తెలిసిందే. గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అటవీ శాఖ అధికారులు, సీఐ వాసుకుమార్ స్పందించి మెట్రి మహదేవతాత మఠం వద్ద వల ఏర్పాటు చేశారు. శుక్రవారం నల్లముచ్చు ఈ వలలో చిక్కింది. పట్టణవాసులు, రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

సమస్యలను పరిష్కరించండి

కంప్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వారి సమస్యలను పరిష్కరించాలని లోకాయుక్త సీఐ మహమ్మద్ రఫీక్ తెలిపారు. శనివారం కంప్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో లోకాయుక్త ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో పలు అంశాలపై చర్చించారు. ఏపీఎంసీ రెండు, మున్సిపాల్టీ ఒకటి, నీటి పారుదల శాఖ ఒకటి, జెస్కామ్, ఆరోగ్య, పురసభ వివిధ శాఖలకు సంబంధించి సమస్యలపై వినతి పత్రాలు అందించారు. హళ్లళ్లి తండా పట్టాలు, మారుతినగర్‌లో వుండే స్థలాల విషయంపై పరిశీలిస్తామని తెలిపారు. గతంలో సీపిరిదిన్ని భాగంలో వుండే వారికి ఇంతవరకు పట్టాలు ఇవ్వలేదనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు.

రూ.100 కోట్లకు లెక్క చెప్పండి

● అమృత యోజన పనుల రికార్డులు ఎక్కడ..?
● అధికారులను ప్రశ్నించిన మేయర్ నందీష్
● వాడివేడిగా బళ్లారి మహానగర పాలికె సర్వసభ్య సమావేశం

బళ్లారి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'అమృత యోజన పథకం ద్వారా ప్రతి ఇంటికీ నల్లా నీళ్ల పేరుతో రూ. 100 కోట్లు ఖర్చుచేశారు. ఆ నిధులతో ఎక్కడ కొళాయి వేశారు. ఎక్కడ ఎంత ఖర్చు చేశారు. అందుకు సంబంధించిన రికార్డులు ఉన్నాయా..? ఉంటే సమావేశంలో సభ్యులకు వివరంగా తెలపండి' అని అధికారులను బళ్లారి నగర పాలికె మేయర్ ముల్లంగి నందీష్ బాబు కోరారు. ముందు నుంచి ఆ నిధుల ఖర్చు గురించి అడుగుతూనే ఉన్నామని, ఎందుకు అధికారులు రికార్డులు, చేసిన పనులు చూపడం లేదని ఆయన ప్రశ్నించారు. శనివారం జిల్లా పరిషత్ సభాభవనంలో బళ్లారి మహానగర పాలికె సర్వసభ్య సమావేశం మేయర్ ముల్లంగి నందీష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అమృత యోజన పథకం నిధుల వాడకం, వాటి లెక్కలు చూపాలని కోరారు. జెస్కాంలో విద్యుత్ పోల్స్ ఒక చోట నుంచి మరో చోటుకు మార్చాలని నాలుగు నెలలుగా వార్డుల్లో ఉండే ప్రజలు కోరుతున్నారు. వినతి పత్రం కూడా ఇచ్చారు. మరి ఎందుకు పోల్స్ మార్చడం లేదని జెస్కాం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పోళ్ల కొరత ఉందని, రాగానే మారుస్తామని జెస్కాం అధికారులు తెలిపారు. కార్పొరేటర్ పద్మజ మాట్లాడుతూ వానాకాలం వచ్చిందంటే ఇళ్లముందే నీళ్లు నిలుస్తున్నాయన్నారు. గతంలో కూడా సమావేశాల్లో అధికారుల దృష్టికి తెచ్చినా పనులు చేయడం లేదన్నారు. ఇలా అయితే తాము ఎందుకు ప్రజా ప్రతినిధులుగా ఉండాలని అధికారులను నిలదీశారు. మూడో వార్డు కార్పొరేటర్ ప్రభంజన్‌కుమార్ మాట్లాడుతూ 2016-2019లో కార్పొరేషన్ పరిధిలో జరిగిన పనులకు ఆడిట్ రికార్డులు ఇవ్వాలని కోరారు. కొళాయిల నుంచి స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదన్నారు. ఇంత వరకూ సీజ్ చేసిన ప్లాస్టిక్ కవర్లు ఎన్ని.. వాటిని ఏమి చేశారు.. టెండర్లు వేసి అమ్మారా అని అధికారులను ప్రశ్నించారు. ప్రభంజన్ అడిగిన అనేక ప్రశ్నలకు అధికారులు నీళ్లు నమిలారు. బీజేపీ కార్పొరేటర్ గోవిందరాజులు, ఇబ్రహీం, ఇతర బీజేపీ కార్పొరేటర్లు మాట్లాడారు. వీరితో పాటు విక్కీ, రామాంజనేయులు, గాదెప్ప తదితర కార్పొరేటర్లు సమస్యలపై మాట్లాడారు. అనేక అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, ఇతర అంశాలపై చర్చించారు.



అధికారులను ప్రశ్నిస్తున్న మేయర్ ముల్లంగి నందీష్ బాబు

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోండి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్‌జుబేర్

బళ్లారి సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల్లో పాల్గొనే ఎన్నికల సిబ్బందితో పాటు ఇతర విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మహమ్మద్ జుబేర్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటు అమూల్యమైనదని, పోలింగ్ రోజున విధి నిర్వహణలో ఉండే అర్హులైన ఉద్యోగులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. జెస్కాం, బీఎస్ఎన్ఎల్, టెలివిజన్, రేడియో, ఆరోగ్యశాఖ, రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థల ఉద్యోగులు, అగ్నిమాపక సేవ, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్ సర్వీస్, జైళ్లతో సహా 16 ఇతర సేవల కింద విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పోలింగ్ ముందురోజు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయవచ్చని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు అవసరమైన సేవల కింద పనిచేస్తున్న ఉద్యోగులు సంబంధిత శాఖ నుంచి 12-డి ఫారమ్ పొంది రసీదు ఇవ్వాలి. నింపిన ఫారాన్ని ఆయా శాఖల అధికారులు ఆ నియోజకవర్గానికి కేటాయించిన నోడల్ అధికారులకు సమర్పించాలన్నారు. సమావేశంలో బ్యాలెట్ నోడల్ అధికారి సోమశేఖర్ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తొణికిసలాడుతున్న తుంగభద్ర



బళ్లారి సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతోంది. డ్యాంలో 101.42 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. ఎగువ నుంచి 73,241 క్యూసెక్కుల వరద నీరు డ్యాంలోకి చేరుతోంది. దిగువకు 74,025 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో 11వేల క్యూసెక్కుల నీరు కాల్వలకు, 63 వేల క్యూసెక్కుల నీరు నదిలోకి వెళుతోంది. ఇన్‌ఫ్లో పెరిగితే లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు. జలాశయ పరివాహక ప్రాంతాలైన ఆగుంబె, శివమొగ్గ, హొసపేట తదితర చోట్ల వర్షాలు బాగా కురుస్తున్నాయి. గత వారంలో జలాశయానికి ఇన్‌ఫ్లో 84వేల క్యూసెక్కులు ఉండగా ఈవారం తగ్గింది. ఈ సంవత్సరం రెండో పంటకు కూడా నీరుపుష్కలంగా లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సండూరులో గెలుపే ధ్యేయం: గాలి

తోరణగల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గంగావతిలో ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే అనిల్ లాడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తాను 40 నెలల అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రూ. 250 కోట్లతో తోరణగల్లు, సండూరు రోడ్డు, సండూరు- కూడ్లిగి రోడ్డు, సండూరు హాస్పిటల్ రోడ్డు, సిమెంటు రోడ్డు వేశామని వివరించారు. బళ్లారి, సండూరు, హొస్పేట ఒక జోన్‌గా ఏర్పరచి జిందాల్ లాంటి సంస్థలను ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉద్యోగం కల్పించాలనే కల ఉందని పేర్కొన్నారు. జిందాల్ సహకారంతో సీఎస్ఆర్ కింద ఎన్నో మంచి కార్యక్రమాలు చేయొచ్చని, కానీ ఇంతవరకు సరైన అభివృద్ధి జరగలేదని విమర్శించారు. అందరూ కలసికట్టుగా పనిచేసి సండూరు ఉప ఎన్నికలలో గెలవాలని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ దేవేంద్రప్ప, బీజేపీ నాయకులు కేఎస్ దివాకర్, బంగారు హనుమంతు, పంపాపతి, రామకృష్ణ, వెంకటేషులు, పురసభ మెంబర్లు, గ్రామ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి



హుండీ లెక్కించిన డబ్బులతో అధికారులు

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 66.6 లక్షలు

బళ్లారి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బళ్లారి దుర్గమ్మ దేవాలయంలో శనివారం హుండీల లెక్కింపు చేశామని ఈవో హనుమంతప్ప తెలిపారు. మొత్తం 9 హుండీల ద్వారా రూ. 66,60,945 ఆదాయం భక్తుల నుంచి హుండీలో వచ్చినట్లు తెలిపారు. ఉదయం నుంచి అధికారికంగా లెక్కలు వేశామని వివరించారు. ఇతర వెండి, బంగారు, కల్యాణకట్టు, పూజావస్తువుల లెక్క తెలియాల్సి ఉంది.

హోసూరు జోన్

నిషేధిత పొగాకు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పొగాకు సంచులతో పోలీసులు

హోసూరు(క్రైం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నిషేధిత పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హోసూరు సమీపంలోని బాగలూరు పోలీసులకు అందిన సమాచారం మేరకు జీమంగలం సమీపంలో వాహనాల తనిఖీల్లో నిమగ్నమైయ్యారు. కర్ణాటక రాష్ట్రం నుంచి హోసూరు వైపు వస్తున్న లగ్జరీ కారును సోదాలు చేయగా తమిళనాడులో నిషేధించిన పొగాకును గుర్తించారు. కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేయ్యగా రాజస్థాన్‌కు చెందిన కేతురామ్ (29)గా గుర్తించారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులను బెంగళూరు నుంచి కోయంబత్తూరుకు తరలిస్తున్న గుర్తించారు. విలువ రూ.2.30 లక్షలుగా తెలిపారు. 392 కిలోల పొగాకు ఉత్పత్తులు, రూ.13 లక్షల విలువైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు విచారణ చేపట్టారు.

జోరు వానతో ప్రజలకు ఇబ్బందులు

హోసూరు అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని కర్నూర్ ప్రాంతంలో వెయ్యికి పైగా కుటుంబాలు నివసిస్తున్నారు. మృత దేహాలను పూడ్చేందుకు గ్రామానికి సమీపంలోని చెరువు ప్రాంతంల్లో 2 శ్మశాన వాటికలు ఉన్నాయి. స్మశానవాటికలకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బురదమయంగా మారిన రోడ్డుపై సంచారం సాధ్యం కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మరోవైపు శాటిలైట్ టౌన్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడంతో వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు వీలులేక నిల్వ అయ్యింది. శనివారం దేవరాజ్ అనారోగ్యంతో మృతి చెందగా నిలిచిన వర్షపు నీటిలో అతని మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లలేకపోయారు. అంత్యక్రియలు సకాలంలో నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ఎలా వెళ్లాలో మార్గం లేక గంటల తరబడి దేహాన్ని అలాగే ఉంచారు. విషయం తెలుసుకున్న మత్తిగిరి పోలీసులు మున్సిపల్ కౌన్సిలర్ వచ్చి వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతదేహాలను శ్మశానవాటికకు తరలించేందుకు శాశ్వత రహదారి సౌకర్యం కల్పించాలని కర్నూర్ ప్రజలు కార్పొరేషన్‌ను కోరారు. దీని ఆధారంగా మున్సిపల్ కౌన్సిలర్ మంజుల మునిరాజ్, గ్రామ పరిపాలన అధికారి నందకుమార్, మత్తిగిరి పోలీస్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పొక్లైనర్ ద్వారా నిలిచిన వర్షపు నీటిని తొలగించి రోడ్డు మరమ్మత్తులు చేశారు.

అండర్‌పాస్ వద్ద ఇరుక్కున్న వాహనాలు

హోసూరులో భారీ వర్షాల కారణంగా రూ. కోటి విలువైన ఖరీదైన రేంజ్ రోవర్ కారు అండర్‌పాస్‌లో చిక్కుకుంది. హోసూరులో ఎడతెరిపి లేకుండా వర్షం కురువడంతో గంటపాటు భారీ వర్ష ప్రభావం వల్ల హోసూరు రైల్వేస్టేషన్ సమీపంల్లోని రైల్వే అండర్ పాస్ వద్ద చేరుకున్న భారీ నీటిలో కొన్ని వాహనాలు చిక్కుకున్నాయి. డెంకణీకోట నుంచి వచ్చే వారు, ఇటు వైపు నుంచి వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా రేంజ్ రోవర్ కారు యజమాని మాత్ర తాడుకట్టి కారును లాగి బయటకు తీసేందుకు ప్రయత్నించారు. కానీ చేసిన ప్రయత్నం ఫలించలేదు. అదే సమయానికి టెంపో రావడంతో టెంపోకు తాడు కట్టి ఎట్టకేలకు కారును బయటకు తీశారు. ఇలా వర్షం కురిసినప్పుడల్లా అండర్‌పాస్‌లో సమస్య తలెత్తుతోందని శాశ్వత పరిష్కారం కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు.



వాన నీటి నుంచి కారును బయటికి తీస్తున్న స్థానికులు



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

నగల చోరీ - నిందితుడి అరెస్టు

హోసూరు(క్రైం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని చోరీ కేసును పోలీసులు ఛేధించారు. హోసూరు రైల్వేస్టేషన్ వెనుక వీటీసీ నగర్‌లో నివసించే రమేశ్ ఇంట్లో చోరీ జరిగింది. సుమారు 5 లక్షల విలువైన నగదు, నగలు చోరీకి గురయ్యాయి. మార్చి 15న కుటుంబ సమేతంగా మధురైకు వెళ్లి రెండు రోజుల తర్వాత తిరిగి రాగా ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న నగలు దొంగతనం జరిగినట్టు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కృష్ణగిరి జిల్లా ఎస్పీ తంగదురై ఆదేశాల మేరకు హోసూరు ఏడీఎస్పీ అక్షయ్ అనిల్ వాకర్ ఆధ్వర్యంలో హోసూరు టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ నేతృత్వంలో ఎస్ఐ ప్రభాకరన్, క్రైం బ్రాంచ్ సోదాలు చేపట్టారు. అలాగే వీటీసీ నగర్ ప్రాంతంలోని సీసీ కెమెరా రికార్డులను పరిశీలించి ఇందుకు పాల్పడిన మైసూరు రాజీవ్ నగర్‌కు చెందిన అబుబకర్(46)ను అరెస్ట్ చేశారు. విచారణలో సయ్యద్ అబుబకర్ 2023 జూన్‌లో సిప్‌కాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతపురంలోని సెందమిళ్ నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి డబ్బు కాజేసినట్లు తెలిసింది. నిందితుడి నుంచి 128 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



అనుమతులు లేకుండా ఇనుప కడ్డీలతో జరుగుతున్న నిర్మాణం

ఏమిటీ నిర్మాణం..?

● అనుమతి లేకుండా ఇనుప కడ్డీలతో భారీ కటౌట్
● పొంతన లేని అధికారుల సమాధానాలు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా నగరంలోని ప్రముఖ ప్రాంతంలో భారీ స్థాయిలో ఇనుప కడ్డీలతో ఓ నిర్మాణం జరుగుతున్నా అధికారులు తమకేమీ తెలియదంటున్నారు. నగరంలోని మోతి సర్కిల్ బుడా ఆవరణంలో ఉన్న ఇందిరా క్యాంటీన్ ముందు భారీ స్థాయిలో ఇనుప పైపులతో కూడిన నిర్మాణం జరుగుతుండడంతో దారిన వెళ్లే ప్రతి ఒక్కరు ఏమిది...? అని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. బళ్లారి అర్బన్ డెవలప్‌మెంట్ అథిరిటీ (బుడా) ఆవరణంలో ఇందిరా క్యాంటీన్ ముందు భాగంలో జరుగుతున్న భారీ నిర్మాణం గురించి ఆ శాఖ అధికారులకే తెలియదు. ఏమిటని ప్రశ్నిస్తే తమకేమి తెలియదని, ప్రస్తుతం నిర్మాణం అవుతున్న స్థలం గతంలో బుడా ఆధీనంలో ఉన్నా... ఇందిరా క్యాంటీన్ నిర్మాణం తరువాత ఆ స్థలాన్ని కార్పొరేషన్‌కు అప్పగించామని సమాధానం చెబుతున్నారు. కార్పొరేషన్ కమిషనర్ కలీల్‌ను ఈ నిర్మాణంపై వివరణ అడిగితే.. తమకు సంబంధించిన స్థలం ఆ ప్రాంతంలో లేదని సమాధానం చెబుతున్నారు. ప్రజా పనుల శాఖ అధికారులను అడిగితే... ఏమో తెలియదనే సమాధానం. ఇలా నగరలో సుమారు వంద అడుగుల ఎత్తు, వంద అడుగుల వెడల్పుతో నిర్మాణమవుతున్న కట్టడానికి సంబంధించి ఎవరూ వివరణ ఇవ్వలేక పోతున్నారంటే... నగరంలో అసలు ఏమి జరుగుతుందో అర్థం కాలేని స్థితి నెలకొంది. అక్కడ పనిచేసే వారిని విచారిస్తే... తమకేమి తెలియదు... మా యజమాని వేయమన్నాడు... వేస్తున్నాం అంటూ పొంతనలేని సమాధానం ఇస్తున్నారు. నగరంలో ఇలాంటి ప్రమాదకరమైన నిర్మాణాలు చేసే సమయంలో బళ్లారి కార్పొరేషన్, బుడా, ప్రజా పనుల శాఖ, అగ్నిమాపక శాఖ, జిల్లా పోలీసు శాఖ నుంచి ప్రత్యేక అనుమతులు పొందాల్సి ఉంటుంది. అధికారుల సమాధానం బట్టి ప్రస్తుతం నిర్మాణమవుతున్న కట్టడానికి ఎలాంటి అనుమతులు లేవని తెలుస్తోంది. అసలే ఎడతెరపి లేకుండా గాలుల తో కూడిన వర్షాలు కురుస్తున్న సమయంలో ఇలాంటి కట్టడాల గురించి అధికారుల దృష్టికే రాలేదంటే... ఈ నిర్మాణం వెనుక స్థానిక రాజకీయ నాయకుల ప్ర మేయం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల క్రితం ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరఢా ఝులిపించిన కార్పొరేషన్ అధికారులు.. నగరం నడిబొడ్డున భారీ ప్రమాణంలో నిర్మాణమవుతుంటే వారికి కనపడలేదా..? తెలిసినా.. తమకెందుకులే అని మౌనం వహిస్తున్నారా...? అర్థం కావడం లేదు.

యతినరసింహానందపై చర్యలు తీసుకోవాలి



జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ముస్లిం నాయకులు

బళ్లారి సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్తను అవమానించిన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యతి నరసింహానంద సరస్వతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం సంఘం నాయకులు, బళ్లారి జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు హుమాయూన్ ఖాన్, ఖాజీ మహమ్మద్ గులామి సిద్దిఖీ డిమాండ్ చేశారు. శనివారం ముస్లిం నాయకులతో కలిసి బళ్లారి జిల్లా కలెక్టర్, ఎస్పీ ద్వారా రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముస్లింల ఆరాధకుడైన మహమ్మద్ గురించి స్వామి నరసింహానంద కించపరిచేలా మాట్లాడారని తెలిపారు. ఇది ఇలాంటి ప్రకటనలు మతపరమైన అశాంతిని సృష్టించి మత ఘర్షణలకు, శాంతికి విఘాతం కలిగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుని సమాజంలో శాంతియుత సహజీవనాన్ని సులభతరం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖులు అల్లాబకాష్, నూర్ అహ్మద్, జహీర్, ఎండీ ఆసిప్, ముజాహిద్, నఖబర్‌స్థాన్ ఖలీల్, మహ్మద్ అలీ, మత గురువులు, ముస్లిం సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వర్షంతో ఉల్లిపంటకు నష్టం



దెబ్బ తిన్న ఉల్లిపంటను చూపుతున్న రైతు లక్ష్మణగౌడ

రాయచూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : గడచిన మూడు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షం వల్ల రైతులు వేసుకున్న ఉల్లిపంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చంద్రబండా క్లస్టర్ పరిధిలోని కడగందొడ్డి తదితర చుట్టుముట్టు గ్రామాల్లో వందల ఎకరాల్లో సాగు చేసిన ఉల్లిగడ్డల పంట పూర్తిగా నష్టపోయి చేతికొస్తున్న ఉల్లిగడ్డలంతా మురిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో కురిసిన వర్షపు వల్ల ఒక్కసారిగా తమ అంచనాలు తలకిందలైయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం విలేఖరులతో మాట్లాడిన రైతు సంఘం నాయకులు లక్ష్మణగౌడ కడగందొడ్డి, పంట నష్టానికి గురైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు పకడ్బందీ చర్యలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి బీఏ పాటిల్

రాయచూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ లెక్కాధికారులు స్థానిక పోలీసుల సహకారంతో మనస్ఫూర్తిగా కృషి చేస్తే ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించడం సులభమని ప్రభుత్వ భూముల రక్షణ ప్రత్యేక న్యాయాలయ అధికారి బీఏ పాటీల్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల కబ్జా నిషేధ చట్టం అమలుకు సంబంధించి శనివారం నగరంలోని జడ్పీ సమావేశం మందిరంలో నిర్వహించిన ఒక రోజు కార్యాగారాన్ని బీఏ పాటీల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ప్రభుత్వ భూములను ఎదేచ్ఛగా కబ్జా చేయడం ఇటీవల పరిపాటిగా మారిందని ఈ విషయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రెవెన్యూ శాఖ ఇతర అన్ని శాఖలకు మాతృ సంస్థ వంటిదని ఆ శాఖకు చెందిన అధికారుల పై మరింత జవాబ్దారి ఉంటుందని అదే సమయంలో గ్రామస్థాయిలో పని చేసే అధికారులు స్థానిక పోలీసుల సహాయంతో ప్రభుత్వ భూముల కబ్జాను సమర్థవంతంగా అడ్డుకోవాలన్నారు.